సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 14 । జూలై । 2023



నెల్లూరు, అనంత జట్ల విజయం

ఏసీఏ సౌత్‌జోన్ అంతర జిల్లాల అండర్ -19 క్రికెట్ టోర్నీలో నెల్లూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. -IIలో..



సిమెంట్ ట్యాంకర్ బీభత్సం

గోపవరం మండలం పి.పి కుంట చెక్‌పోస్ట్ వద్ద సిమెంట్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. అదుపుతప్పి ట్రాక్టర్, బస్సును ఢీకొంది -IIలో..

గరిష్ఠం/కనిష్ఠం
34.7/26.1

వాతావరణం

జిల్లాలో గురువారం 26.1 – 34.7 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేటి డిగ్రీ పరీక్ష వాయిదా

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలో నేడు (శుక్రవారం) నిర్వహించాల్సిన డిగ్రీ పరీక్షను 21వ తేదీకి వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి తెలిపారు. డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు రాష్ట్ర వ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో పరీక్ష వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు.

నేడు డిగ్రీ కళాశాలలు బంద్

వైవీయూ : డిగ్రీ కళాశాలల ప్రవేశాల ఫీజుల తగ్గింపునకు నిరసనగా శుక్రవారం డిగ్రీ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాల సంఘాల ప్రతినిధులు జి.సుబ్బారెడ్డి, శ్రీనివాసులు తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జీఓ.ఎంఎస్.22 ప్రకారం ఏపీహెచ్‌ఈఆర్ఎంసీ ఫీజుల నిర్ణయం సరికాదన్నారు. శుక్రవారం నిర్వహించే బంద్‌కు అందరూ సహకరించాలని కోరారు.

సాహితీవేత్తకు 'జీవిత సాఫల్యం'



డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు: రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి ఓఎస్‌డీ డాక్టర్ ఎం.ప్రభాకర్‌రెడ్డికి హైదరాబాద్‌కు చెందిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ సంస్థ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రకటించిందని ఏపీజీబీ రిటైర్డ్ అధికారి జానమద్ది విజయభాస్కర్ తెలిపారు. ప్రొద్దుటూరుకు చెందిన కవి, రచయిత, ప్రభుత్వ ఉద్యోగి అయిన డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి పలు రచనలు చేశారని.. పలు బిరుదులు, సత్కారాలు పొందారన్నారు.

నిరంతరాయంగా విద్యుత్



మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ రమణ

కడప కార్పొరేషన్: జిల్లాలో విద్యుత్ అంతరాయాలు ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీఎస్‌పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ అధికారులను ఆదేశించారు. కడపలోని విద్యుత్ భవన్‌లో గురువారం నిర్వహించిన 'డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ' కార్యక్రమంలో ఆయన వినియోగదారుల ఫిర్యాదులను ఫోన్ ద్వారా స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన 8 ఫిర్యాదులను గడువులోపు పరిష్కరించాలని సంబంధితులకు ఎస్ఈ ఆదేశాలు జారీ చేశారు.

కొలువుల పంట!



ఈ ఫొటోలో ఉన్న యువకుడు కాళ్ల రాజేష్, బుచ్చనపల్లె గ్రామం, గోపవరం మండలవాసి. 2018లో ఎలక్ట్రికల్ డిప్లొమా పూర్తి చేశాడు. ఉపాధి కోసం బయట నగరాలకు వెళ్లలేక కుటుంబ అవసరాల రీత్యా గ్రామంలోనే ఉంటూ ఇంటి పెద్దలకు చేదోడు వాదోడుగా రోజువారీ కూలీ పనులకు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ప్రభుత్వం గోపవరం సమీపంలో సెంచురీ ప్లైవుడ్స్ ఏర్పాటు చేయడంతో ఉద్యోగం దక్కింది. సొంత ఊరిలో ఉద్యోగం రావడంతో రాజేష్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి స్థానికులకు ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి ఆచరణలో చూపెట్టడంతోనే తనకు ఉద్యోగం దక్కిందని సంతోషం వ్యక్తం చేశాడు.



ఇక్కడి ఫొటోలోని యువకుడి పేరు గుడిమె గుర్రయ్య, బద్వేల్ నియోజకవర్గం కలసపాడు నివాసి. ఐటీఐ ఎలక్ట్రికల్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఐదేళ్లుగా ఎదురుచూపులు చూశాడు. కుటుంబం కోసం స్థానికంగా ఎలక్ట్రికల్ పనులు చేసుకుని బతికేవాడు. ఇక ఇంతకుమించి మరే ఉద్యోగం రాదనుకున్నాడు. సొంత నియోజకవర్గంలో సెంచురీ ప్లైవుడ్స్ పరిశ్రమ నిర్మాణం కావడం.., స్థానికులకు 75శాతం ఉద్యోగాలు అమలు కావడంతో గుర్రయ్యకు ఉద్యోగం వెతుక్కుంటూ వచ్చింది. దీంతో అతని కుటుంబం ఆనందం వ్యక్తం చేస్తోంది.

- ఉద్యోగాల తోటగా కొప్పర్తి పారిశ్రామికవాడ
- అల్ డిక్సన్ కంపెనీలో ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు
- సెంచురీ ప్లైబోర్డ్స్‌లో స్థానికులకు అగ్రపీఠం
- వేలాది మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు



ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభమైన అల్ డిక్సన్ కంపెనీలో విధుల్లో నిమగ్నమైన ఉద్యోగులు

సాక్షి ప్రతినిధి, కడప: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంతో జిల్లాలో పరిశ్రమలు కొలువుదీరుతున్నాయి. స్థానిక యువతకు సొంతూర్లోనే ఉద్యోగాలు వరిస్తున్నాయి. కొప్పర్తి పారిశ్రామికవాడలోని వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చర్ క్లస్టర్ (ఈఎంసీ), జేఎస్‌డబ్ల్యూ, వైఎస్సార్ స్టీల్స్, సెంచురీ ప్లైవుడ్స్ పరిధిలో వేలాదిమందికి ప్రత్యక్ష ఉద్యోగాలు దక్కనున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక ప్రగతి సాధించాలనే కృతనిశ్చయంతో ఉండడంతోనే యువతకు వారి వారి స్వస్థలాల్లో ఉద్యోగాలు లభిస్తున్నాయి.

తలమానికంగా నిలవనున్న వైఎస్సార్ ఈఎంసీ...

కొప్పర్తి పారిశ్రామిక వాడలో 540 ఎకరాలల్లో రూ.748 కోట్లతో మౌళిక వసతులు సమకూర్చుతూ వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చర్ క్లస్టర్ ఏర్పాటు చేశారు. ఇందులో రూ.10వేల కోట్లు పెట్టుబడులు రానున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. తద్వారా లక్ష మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. అందులో భాగంగా ఆల్ డిక్సన్ కంపెనీతో ప్రత్యక్ష ఉపాధికి మొగ్గ తొడిగింది. సీసీ కెమెరాలు, డిజిటల్ వీడియో రికార్డర్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను ఉత్పత్తి చేసే ఆల్ డిక్సక్ కంపెనీ తొలిదశ పరిశ్రమ వాడుకలోకి వచ్చింది. తద్వారా యువతకు ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు లభించాయి. రూ.127 కోట్లు పెట్టుబడితో నిర్మించిన ఈ సంస్థలో మొత్తంగా 1800 మందికి ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. మొదటి దశలో ఉత్పత్తులు ప్రారంభం కాగానే 860 మందిని ఉద్యోగులను తీసుకుంది. ప్రస్తుతం ఆల్ డిక్సన్ కంపెనీలో ఉద్యోగాలు చేస్తున్న వారిలో అత్యధికులు జిల్లా వాసులే కావడం విశేషం. సామర్థ్యం పెంపులో భాగంగా మరో 1100 మందికి అక్కడ ఉద్యోగాలు దక్కనున్నాయి. పరిశ్రమలోకి వెళ్తే విదేశాల్లో ఉన్న అనుభూతి కలుగుతోందని అక్కడ పని చేసే ఉద్యోగులు ఆనందంగా చెబుతున్నారు.

సెంచురీ ప్లైబోర్డ్స్‌లో....

గోపవరం సమీపంలో రూ.956 కోట్లు అంచనాతో సెంచరీ ప్లైబోర్డ్స్ పరిశ్రమ నిర్మించారు. రెండు దశలు విస్తరణతో ఆ పెట్టుబడులు రూ.1600 కోట్లుకు చేరాయి. 2024 డిసెంబర్ నాటికి ఉత్పత్తి లక్ష్యం కాగా, 2023 డిసెంబర్ నాటికే పూర్తి కానుంది. ఇందులో 2662 మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు లభించన్నాయి. అందులో75శాతం స్థానికులకే ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే దాదాపు 2వేల మంది జిల్లాకు చెందిన వారికి ఉద్యోగాలు దక్కనున్నాయి. ఆమేరకు ఆ సంస్థ చైర్మన్ సజ్జన్ భజాంకా సైతం స్పష్టం చేశారు. స్కిల్స్ లేకున్నా సరే ఉద్యోగులుగా స్థానికులను ఎంపిక చేసుకొని వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. బద్వేల్ ప్రాంతంలో నిరుద్యోగులకు సెంచురీ ప్లై బోర్డ్స్ పరిశ్రమ ఎంతో ఉపయోగకరంగా నిలవనుంది.

అగ్రగామిగా కడప...

మరో రెండేళ్లలో వైఎస్సార్ జిల్లా అగ్రగామిగా నిలవనుంది. రూ.8,800 కోట్లుతో జేఎస్‌డబ్ల్యూ స్టీల్స్ అందుబాటులోకి రానుంది. తద్వారా 25వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణం వల్ల జమ్మలమడుగు, ప్రొద్దుటూరు పట్టణాలు కలిసిపోనున్నాయి. ఇక్కడ ఏర్పాటు చేసే ప్లాంట్ దేశంలోనే మాడరన్‌గా ఏర్పాటు చేయనున్నట్లు జేఎస్‌డబ్ల్యూ చైర్మన్ సజ్జన్ జిందాల్ ప్రకటించారు. ఆమేరకు కృత నిశ్చయంతో వ్యవహరిస్తున్నారు. ఓవైపు స్టీల్ ప్లాంట్ మరోవైపు కొప్పర్తి పారిశ్రామికవాడ సమాంతరంగా వృద్ధి చెందనున్నాయి. తద్వారా జిల్లాలో కొలువులు పంట పండనుందని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

యువతకు ఉద్యోగాల వెల్లువ

రాబోవు రోజుల్లో జిల్లాలో ఉద్యోగాల వెల్లువ రానుంది. పారిశ్రామిక ప్రగతి దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పటికే సెంచురీ ప్లైబోర్డ్స్, ఆల్ డిక్సన్ కంపెనీలు అందుబాటులోకి వచ్చాయి. తద్వారా వేలాది మందికి ప్రత్యక్ష ఉపాధి జిల్లాలోని యువతకు దక్కింది. పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం లభిస్తున్న కారణంగా పరిశ్రమలు విస్తృతం కానున్నాయి. అందుకు తగ్గట్లుగా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాం.
–శ్రీనివాసమూర్తి, ఏపీఐఐసీ జెడ్ఎం

ముఖ్యమంత్రి సంకల్పం సిద్ధిస్తుంది



కొప్పర్తి పారిశ్రామికవాడలో వైఎస్సార్ ఈఎంసీ ద్వారా లక్షల మందికి ప్రత్యక్ష ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. పారిశ్రామిక ప్రగతి కోసం సీఎం వైఎస్ జగన్ దూరదృష్టితో వ్యవహరిస్తున్నారు. జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ప్రణాళిక రచిస్తున్నారు. స్టీల్ ప్లాంట్‌కు కావాల్సిన అన్నీ అనుమతులు సమకూర్చుతున్నారు. సీఎం సంకల్పం సిద్ధించనుంది. – కె.విజయ్ రామరాజు, కలెక్టర్

పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ హైవే

కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ



మదనపల్లెలో స్వాస్థ్య ఆస్పత్రిని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ, ఎంపీ మిథున్‌రెడ్డి

మదనపల్లె: దేశంలోని జాతీయరహదారుల నిర్మాణంలో పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర రహదారులు, రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ అన్నారు. గురువారం మదనపల్లెలో సత్సంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, పద్మభూషణ్ ముంతాజ్‌అలీ (శ్రీఎం) ఆధ్వర్యంలో నిర్మించిన స్వాస్థ్య మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌ను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ మాట్లాడుతూ...జాతీయరహదారులపై పెద్దమొత్తంలో చెట్లను ట్రాన్స్‌ప్లాంట్ చేసేందుకు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటివరకు 3కోట్ల87లక్షల చెట్లకు జియోట్యాగ్ చేయడంతో పాటుగా 68,000 చెట్లను ట్రాన్స్‌ప్లాంట్ చేశామన్నారు. రోడ్ల నిర్మాణంలో పర్యావరణాన్ని పెంపొందించేందుకు గ్రీన్ హైవేల నిర్మాణాలు చేస్తున్నామన్నారు.దేశంలోని రోడ్లు అందరివని, అభివృద్ధికి సంబంధించి వివక్ష చూపలేదన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎక్స్‌ప్రెస్ హైవేలను కేటాయించామన్నారు. దేశంలో పెట్రోల్, డీజిల్ వినియోగం అధికమవుతోందని, దాదాపు 16 వేల కోట్ల లీటర్లు దిగుమతులు చేసుకోవడం జరుగుతోందని, వీటిని తగ్గించేదిశగా ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల్లో కేంద్రమంత్రి నితిన్ గడక్కరీ సహకారం మరువలేనిదన్నారు. పద్మభూషణ్ ముంతాజ్‌అలీ(శ్రీఎం) మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారికి సాంత్వనతో స్వస్థత చేకూర్చడమే ప్రధాన ధ్యేయంగా స్వాస్థ్య మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించామన్నారు.

బ్రహ్మంగారి హుండీ కానుకల లెక్కింపు



హుండీల నగదును లెక్కిస్తున్న భక్తులు

బ్రహ్మంగారిమఠం: పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠంలో మూడు నెలలుగా భక్తులు సమర్పించుకున్న హుండీ కానుకలను గురువారం దేవస్థానం ఆవరణలో లెక్కించారు. ఈ మేరకు రూ 59,71,290 నగదు, 0.140గ్రాములు బంగారు ఆభరణాలు, 1కేజీ 28గ్రాముల వెండి వచ్చినట్లు మఠం మేనేజర్ ఈశ్వరాచారి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఏసీ మఠం పిట్‌పర్సన్ శంకర్‌బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

సీఎం నిర్ణయంతో అర్చకుల జీవితాల్లో వెలుగు



విలేకరులతో మాట్లాడుతున్న విజయ్‌భట్టర్

కడప కల్చరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్చకుల రిటైర్‌మెంట్ విషయంలో తీసుకున్న నిర్ణయం వారి జీవితాల్లో వెలుగుగా మారనుందని రాష్ట్ర అర్చక సమాఖ్య జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర అర్చక సంఘం సహాయ కార్యదర్శి విజయ్‌భట్టర్ అన్నారు. గురువారం కడప నగరం మోచంపేటలోని శంకరమఠంలో అర్చక పురోహిత సంఘం సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు రోజుల కిందట జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలయ అర్చకుల రిటైర్‌మెంట్ పద్ధతిని సడలించి వంశ పారంపర్య హక్కును పునరుద్ధరిస్తూ చేయగలిగినంత కాలం అర్చకులు ఆలయాలలో కైంకర్యాలు చేయవచ్చని నిర్ణయించడం అర్చకుల జీవితాల్లో వెలుగులు నింపినట్లయిందని అభిప్రాయపడ్డారు. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ఆలయంలో పనిచేస్తున్న అర్చకునికి నెలకు రూ. 10 వేలు చొప్పున గౌరవ వేతనం ఇచ్చేందుకు సిద్ధం కావడం ఆయనకు అర్చకుల పట్ల ఉన్న గౌరవానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం...
సచివాలయాలతో సాకారం

వీధి చివర కొలువుదీరిన సచివాలయాలతో సంక్షేమ ఫలాలు ఇంటి ముంగిటకే చేరుతున్నాయి. అధికారుల చుట్టూ తిరగాల్సిన పనే లేకుండా అర్హత పత్రాలన్నీ గుమ్మం దగ్గరికే వచ్చి వాలిపోతున్నాయి. ఫలితంగా ఒకప్పుడు నాయకుల మాటలకే పరిమితమైన గాంధీజీ గ్రామ స్వరాజ్యం నేడు సచివాలయ వ్యవస్థతో సాకారమైంది. పాలనలో ఇంత సంస్కరణ జరిగినా.. సంక్షేమం పరవళ్లు తొక్కుతున్నా 'పచ్చ' మీడియా కళ్లకు కనిపించడం లేదు. సచివాలయాల్లో మెయింటనెన్స్ నిధుల్లేవంటూ రోత రాతలు రాస్తున్నారు. దీనిపై ఫ్యాక్ట్ చెక్.

- ఇంటి ముంగిటకు ప్రభుత్వ సేవలు, సంక్షేమ ఫలాలు
- గ్రామ పంచాయతీలకు మహర్దశ



వేల్పులలోని సచివాలయ భవన సముదాయం

కడప సెవెన్‌రోడ్స్ : ఒకప్పుడు ఏ చిన్న పనికైనా తాలూకా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. ఎన్టీఆర్ తీసుకొచ్చిన మండల వ్యవస్థ గొప్ప పాలన సంస్కరణ. ఆ తర్వాత ఇన్నేళ్లకు సచివాలయ వ్యవస్థతో సంస్కరణకు శ్రీకారం జరిగింది. మండల కేంద్రానికి కూడా వెళ్లాల్సిన అవసరం లేకుండా సచివాలయాల ద్వారా ప్రజలు తమ ఇంటి వద్దనే ప్రభుత్వ సేవలు పొందుతున్నారు. ఒకప్పుడు ఏట కొన్ని పెద్ద గ్రామాల్లోనే పంచాయతీ కార్యాలయ భవనాలు ఉండేవి. ఇప్పుడు దాదాపు ప్రతి పంచాయతీలో సచివాలయ భవనాలు వెలిశాయి. సర్పంచులు అందులో నుంచే విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకప్పుడు గ్రామ పంచాయతీల్లోని ప్రజలను పలు సమస్యలు చుట్టుముట్టి పీడిస్తుండేవి. సచివాలయాలతో సమస్యలకు క్షేత్ర స్థాయిలోనే పరిష్కారం అందుతోంది. జిల్లాలో 557 గ్రామ పంచాయతీలు ఉండగా, 427 సచివాలయాలు ఉన్నాయి. గ్రామ సచివాలయ భవన నిర్మాణాలను రూ. 16,985 లక్షల అంచనా విలువతో చేపట్టారు. ఇప్పటికి 316 పూర్తి కాగా, 109 పురోగతిలో ఉండగా ఒకచోట పనులు ప్రారంభం కాలేదు. 2023 ఏప్రిల్ 21వ తేది నాటికి భవన నిర్మాణాల కోసం రూ. 16121.02 లక్షలు ఖర్చు చేశారు.

- జిల్లాలో 417 రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు రూ. 9090.60 లక్షల అంచనా విలువలతో చేపట్టారు. ఇప్పటికి 224 పూర్తి కాగా, 191 పురోగతిలో ఉన్నాయి. రెండుచోట్ల పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటికి రూ. 7551.64 లక్షలు ఖర్చు చేశారు. గ్రామ సచివాలయ ప్రాంగణంలోనే ఉండే ఆర్బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుతున్నాయి. వ్యవసాయ సలహాలు పొందుతున్నారు.
- జిల్లాలో 338 హెల్త్ క్లినిక్‌లను రూ. 5915.00 లక్షల అంచనా విలువలతో చేపట్టారు. ఇప్పటికి 131 నిర్మాణాలు పూర్తి కాగా 206 పురోగతిలో ఉండగా, ఒకచోట పనులు ప్రారంభించాల్సి ఉంది. ఇప్పటివరకు రూ. 4213.13 లక్షలు ఖర్చు చేశారు.
- బీఎంసీయూ (ఫేస్-1) కింద 43 పనులను రూ. 759.81 లక్షల అంచనా విలువతో చేపట్టారు. ఇందులో ఐదు పనులు పూర్తి కాగా 15 పురోగతిలో ఉండగా, 23 పనులు ప్రారంభించాల్సి ఉంది. ఇప్పటి దాక రూ. 293.15 లక్షలు ఖర్చు చేశారు.
- జిల్లాలో 199 డిజిటల్ లైబ్రరీల పనులను రూ. 3184.00 లక్షల అంచనా విలువతో చేపట్టారు. ఇప్పటికి ఏడు పూర్తికాగా, 64 పురోగతిలో ఉండగా, 128 చేపట్టాల్సి ఉంది. ఇందుకు రూ. 1157.94 లక్షలు ఖర్చు చేశారు.

అందుబాటులోకి పలు సేవలు

ఒకప్పుడు పెన్షన్ పొందడానికి అనేక అవస్థలు ఎదుర్కొనేవారు. రోజుల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు వలంటీర్లు ప్రతినెల 1వ తేది ఉదయాన్నే ఇళ్ల వద్దకు వచ్చి తలుపు తట్టి మరీ పెన్షన్ ఇచ్చి వెళుతున్నారు. గతంలో రెవెన్యూ సంబంధమైన సర్వే, సబ్ డివిజన్, మ్యూటేషన్స్, పాసు పుస్తకాలు, ఆన్‌లైన్ తదితర సేవల కోసం మండల కేంద్రాల్లో రోజులు, నెలల తరబడి తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు సచివాలయాల్లోనే వీఆర్వోలు, సర్వేయర్లు అందుబాటులో ఉన్నారు. ప్రభుత్వం తాజాగా రిజిస్ట్రేషన్ సేవలను కూడా సచివాలయాల్లోనే అందుబాటులోకి తీసుకు రావడం ప్రజలకు మరింత సౌలభ్యంగా మారింది. వివిధ రకాలు సర్టిఫికెట్లు, హౌసింగ్ తదితర 500 పైబడిన సేవలు క్షేత్ర స్థాయిలోనే అందుతున్నాయి. సచివాలయాలకు ప్రభుత్వం కంప్యూటర్లు, రికార్డులు, ఫర్నీచర్లు, పేపర్లు అన్నింటినీ అందుబాటులోకి తీసుకొచ్చింది.

2020-21 నుంచి 2023-24 వరకు పంచాయతీలకు గ్రాంట్

గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వం 2020-21 నుంచి 2023-24 వరకు మొత్తం 1,90,37,81,302 రూపాయలు విడుదల చేసింది. సచివాలయాల ద్వారా 545 పైబడి సేవలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. గ్రామ పంచాయతీలకు ఇది మహర్దశే అని చెప్పవచ్చు. సచివాలయాల నిర్వహణకు సంబంధించిన నిధుల లభ్యత అనే అంశం చాలా చిన్నది. ప్రస్తుతం జనరల్ ఫండ్ కింద వినియోగిస్తున్నాం. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాగానే పంచాయతీ జనరల్ ఫండ్‌కు సర్దుబాటు అవుతుంది.
– ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి, కడప

ఫ్యాక్ట్ చెక్

నిధులు పుష్కలం

గోదాముల నిర్మాణాలకు సరిపడా నిధులున్నాయి.. పనులూ జోరుగా సాగుతున్నాయి. 'రైతును రాజు'గా గుర్తించి సాగుతున్న పాలన ఇది . ఆటంకాలను దాటుకుంటూ అనునిత్యం రైతు సేవలో తరిస్తున్న ప్రభుత్వమిది. నిధులు పుష్కలంగా ఉన్నా.. పనులు సాగుతున్నా పచ్చ పత్రిక కళ్లకు గంతలు కట్టుకుంది. పాపం.. జనాల్ని నమ్మించేందుకు లేనిది ఉన్నట్లుగా చూపిస్తూ.. అబద్ధాలను అచ్చేస్తోంది.

- గోదాముల నిర్మాణ పనులు హోరు.. బిల్లుల చెల్లింపులు జోరు
- రూ. 6 కోట్ల బిల్లులకుగాను ఇప్పటికి రూ. 4 కోట్లు పైనే చెల్లింపు
- మరో 50 లక్షల బిల్లులు త్వరలో చెల్లింపు
- గడువులోపే తొలి దశ పనులు పూర్తి
- రెండవ విడత గోదాముల నిర్మాణానికి జరుగుతున్న టెండర్లు
- ఇప్పటిదాకా 18 వాటికి టెండర్లు పూర్తి, 8 వాటికి అగ్రిమెంట్లు పూర్తి



యర్రగుంట్ల మండలం తిప్పలూరులో పూర్తి అయిన గోదాం నిర్మాణ పనులు

కడప అగ్రికల్చర్: అన్నదాతలకు ప్రభుత్వం అడుగడుగునా అండగా నిలుస్తోంది. ఆరుగాలం శ్రమించి అన్నదాతలు పండించిన పంట దిగుబడుల నిల్వ చేయడానికి సరిపడా గోదాములను అందుబాటులోకి తెచ్చేందుకు అహర్నిశలు కృషి చేస్తోంది. గోదాముల నిర్మాణానికి సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో స్థలాల సేకరణ, నిర్మాణానికి పరిపాలన అనుమతి వంటి పనులను చేపట్టే విషయంలోనూ ఒప్పందం ప్రకారం కాంట్రాక్టరుకు సకాలంలో బిల్లులు చెల్లిస్తూ గడువులోపే పనులను ముగిస్తోంది. అంతేకాకుండా ఇటీవలే జిల్లాలో మరో 62 గోదాముల ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పనులకు సంబంధించి ప్రస్తుతం టెండర్లు పిలుస్తున్నారు. రెండవ దశ గోదాముల నిర్మాణానికి కూడా నిధులు పుష్కలంగా ఉన్నాయి. అయితే ప్రస్తుతం కొన్ని గోదాముల నిర్మాణ పనుల టెండర్ల పూర్తికాగా మరి కొన్నింటికి అగ్రిమెంట్లు జరుగుతున్నాయి. ఇంతలోనే నిధులు లేక తాత్కాలికంగా పనులు నిలిచిపోయాంటూ అసత్య కథనాలను ప్రచురిస్తూ ప్రజలను పక్కదారి పట్టించేందుకు పచ్చ పత్రిక విశ్వ ప్రయత్నం చేస్తోంది.

మొదటి దశ పనులు ...

జిల్లాలో మొదటి దశలో 15 మల్టీపర్పస్ ఫెసలిటీ సెంటర్(ఎంపీఎఫ్‌సీ గోదాం)మంజూరు చేసింది. ఇందులో ఒక్కోదానికి రూ. 40 లక్షల చొప్పున 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. ఇందుకోసం ఒక్కొక్కదానికి 32 నుంచి 50 సెంట్ల స్థలాన్ని సేకరించాలని రెవిన్యూ శాఖకు అప్పగించింది. ఇందులో అక్కడక్కడ స్థల సేకరణకు కొన్ని సమస్యలు తలెత్తినా సకాలంలో స్థలాలను గుర్తించి టెండర్లను పూర్తి చేసి పనులను ప్రారంభించారు. సంబంధిత పనులు చకచకా జరుగుతున్నాయి. ఈ పనులు ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. ఈ పనులు వేగవంతంగా జరగడమే కాకుండా సంబంధిత పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు కూడా బిల్లులను సకాలంలో చెల్లిస్తూ పనులను చేస్తున్నారు.

నిధుల కొరత లేదు...

జిల్లాలో మొదటి విడతలో చేపట్టిన 15 గోదాముల నిర్మాణానికి ఎక్కడా నిధుల కొరత లేదు. ఇందులో ఇప్పటివరకు 9 గోదాముల పనులను పూర్తి చేశాము, మిగతా 6 గోదాముల పనులను 70 శాతం పూర్తి చేశాము. సంబంధిత పనులను సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాల్సి ఉంది. ఆ గడువులోపు పనులను పూర్తి చేస్తాం. ఇందుకు సంబంధించిన బిల్లుల చెల్లింపును కూడా ఎప్పటికప్పుడు నిబంధనల ప్రకారం కాంట్రాక్టరకు చెల్లిస్తున్నాము. రెండవ విడతకు సంబంధించి ప్రస్తుతం టెండర్లు జరుగుతున్నాయి. టెండర్లు పూర్తికాగానే పనులను మొదలు పెడతాం.
– వెంకటేశ్వరావు, వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు

9 చోట్లు పనులు పూర్తి..
మరో 6 చోట్లు 70 శాతం మేర పూర్తి..

జిల్లాలో చెన్నంరాజుపల్లె(పొద్దుటూరు) గద్దంవారిపల్లె(వీఎస్‌పల్లె), కె.అగ్రహారం(ఖాజీపేట), లింగాపురం (పొద్దుటూరు), కొండాపురం, నాగిరెడ్డిపల్లె(సికెదిన్నె), వెల్లటూరు(పెండ్లిమర్రి(, గోనుమాకులపల్లె (వీఎస్‌పల్లె), తిప్పలూరు(ఎర్రగుంట్ల)లలో పనులు పూర్తి అయాయి. అలాగే పోరుమామిళ్ల, పైడి కాల్వ (వల్లూరు) ముద్దనూరు, నల్లింగాయపల్లె(కమలాపురం), వద్దిరాల(జమ్మలమడుగు), దువ్వూరులలో 70 శాతం మేర పనులను పూర్తి అయాయి. మిగతా పనులను సంబంధిత గడువులోపు పూర్తి చేసేందుకు అన్ని చర్యలను చేపట్టారు. ఇందుకు సంబంధించి మొత్తం రూ. 6 కోట్లు బిల్లులు కాగా నిబంధనల ప్రకారం ఇప్పటి వరకు రూ. 4,06,47,000 బిల్లులను కాంట్రాక్టరుకు చెల్లించారు. మరో రూ.50 లక్షలు చెల్లించేందుకు బిల్లులను సిద్ధం చేశారు. ఈ బిల్లులు కూడా త్వరలో కాంట్రాక్టరుకు చెల్లించనున్నారు. మిగతా బిల్లును కూడా పనులు పూర్తి చేసే దాని ప్రకారం చెల్లించనున్నారు. గడువులోపు జీఎస్‌టీపోగా చెల్లించవలసిన బిల్లులను కూడా చెల్లించనున్నారు.

రెండవ దశ పనులకు సంబంధించి...

జిల్లాలో రెండవదశలో 62 గోదాములను మంజూరు చేశారు. వీటిలో 36 గోదాములు వెయ్యి టన్నుల సామర్థ్యంతో కాగా 26 గోదాములు 500 టన్నుల కెపాసిటితో మంజూరయ్యాయి. వీటిలో 52 గోదాములకు స్థలాల సేకరణ పూర్తి అయ్యింది. మిగతా వాటికి స్థలాల కేటాయింపు జరుగుతుంది. వీటిలో మొదటి దశలో 18 వాటికి టెంటర్లు పూర్తయ్యాయి. టెండర్లన్నీ పూర్తి అయి అగ్రిమెంట్లు పూర్తికాగానే పనులను ప్రారంభించనున్నారు. పనులను ప్రారంభించిన తరువాత మూడు నెలల్లో పనులను పూర్తి చేయనున్నారు.

సెటిల్మెంట్లు చేయడం చట్టవిరుద్ధం

– ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్

ప్రొద్దుటూరు క్రైం : చట్టపరమైన అధికారుల ప్రమేయం లేకుండా భూమి, డబ్బు సంబంధిత సెటిల్మెంట్ వ్యవహారాలను నిర్వహించడం చట్టవిరుద్ధమైనదిగా పరిగణించనున్నట్లు ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేరణాకుమార్ తెలిపారు. ఈ మేరకు గురువారం సాయంత్రం ఏఎస్పీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత కేసులో చట్టవిరుద్ధమైన సెటిల్మెంట్ జరుగుతున్న క్రమంలో రామమోహన్‌రెడ్డిపై కేసులోని ఐదుగురు నిందితులు దాడికి పాల్పడ్డారన్నారు. కాల్ రికార్డులు, టవర్ లొకేషన్‌తో పాటు అక్కడ ఉన్న ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలం ద్వారా సంఘటనా స్థలంలో నిందితులు ఉన్నట్లు నిర్ధారణ జరిగిందని చెప్పారు. ఎలాంటి దర్యాప్తు చేయకుండా అరెస్ట్ చేసినట్లు కొందరు ఆరోపించడం సరికాదని ఏఎస్పీ తెలిపారు. ఈ కేసులోని ఫిర్యాది శాంతమ్మ మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చే సమయంలో కూడా ఇరువర్గాలను రామాంజనేయులరెడ్డి భూ తగాదాపై సెటిల్‌మెంట్‌కు పిలిచినట్లు స్వయంగా వెల్లడించినట్లు ఏఎస్పీ తెలిపారు. సదరు సెటిల్మెంట్ చేయడమనేది చట్టవిరుద్ధంతో పాటు నేరమని చెప్పారు. ఇప్పటి వరకు సంబధిత అధికారుల నుంచి పోలీసులకు పోస్టుమార్టం సర్టిఫికెట్ అందలేదన్నారు. అయితే ఒక వ్యక్తి వీడియోలో తన వద్ద పోస్టుమార్టం సర్టిఫికెట్ ఉన్నట్లు చెప్పాడన్నారు. సాక్షులను ప్రభావితం చేసే లేదా దర్యాప్తును తప్పుదోవ పట్టించేలా అసత్యాలు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా పరిగణించడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు. రామమోహన్‌రెడ్డి కేసులో అవాస్తవాలను, అసత్యాలను ప్రచారం చేయొద్దని పోలీసుశాఖ తరపున ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నామని ఏఎస్పీ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ : వ్యక్తి మృతి


ప్రసాద్ మృతదేహం

బి.కోడూరు : మండలంలోని రాఘవరెడ్డిపేట గ్రామ సమీపంలో బద్వేలు – పోరుమామిళ్ల ప్రధాన రహదారిపై బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఎం.నరసింహ్మాపురం గ్రామానికి చెందిన యడవల్లిప్రసాద్ (36) అక్కడికక్కడే మృతిచెందాడు. వివరాలు.. పాస్‌పోర్టు రెన్యువల్ నిమిత్తం తన స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంలో తిరుపతికి బయలుదేరాడు. మార్గమధ్యలోని రాఘవరెడ్డిపేట సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గడ్డం కింద, తలకు వెనుకభాగంలో బలమైన గాయాలయ్యాయి. దీంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బి.కోడూరు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రసాద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గురువారం మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, ఎంపీపీ కోడూరుచెన్నమ్మ, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి ప్రసాద్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చల్లారని జ్వాల

పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలపై వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లో గురువారం కూడా నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజలకు ప్రభుత్వ సేవలు దూరం చేయాలనే కుట్రలపై ఆగ్రహావేశాలు పెల్లుబుకుతున్నాయి. పవన్ దిష్టిబొమ్మలను చెప్పులతో కొడుతూ ర్యాలీ నిర్వహించి దహనం చేశారు. తమకు క్షమాపణలు చెప్పేవరకు ఆందోళనలు కొనసాగిస్తామని వలంటీర్లు స్పష్టం చేస్తున్నారు.

- పవన్ వ్యాఖ్యలపై వెనక్కు తగ్గని వలంటీర్లు
- కొనసాగుతున్న ఆందోళనలు
- పవన్ దిష్టిబొమ్మల దహనం
- క్షమాపణకు డిమాండ్


చింతకొమ్మదిన్నెలో.. పవన్ దిష్టిబొమ్మన దహనం చేస్తున్న వలంటీర్లు

వేంపల్లె : వలంటీర్ వ్యవస్థపై జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం మండలంలోని ముతుకూరు గ్రామంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎక్కడా అవినీతికి తావు లేకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను తీసుకొచ్చారన్నారు. అందులో భాగంగా ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులు, వృద్ధుల వివరాలను సేకరించి సమాచారం ఇస్తున్నారని పవన్ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పేదల కోసం నిష్పక్షపాతంగా సేవ చేస్తున్న వలంటీర్ల సేవలు కనిపించడంలేదా అని వారు ప్రశ్నించారు. వలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేయాలనే పవన్ భేషరతుగా క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

చింతకొమ్మదిన్నె : వలంటీర్లపై పవన్ కల్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని మండల కన్వీనర్ గూడ ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో వలంటీర్లు నిరసన చేపట్టి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి వలంటీర్లు కృషి చేస్తారన్నారు. కార్యక్రమంలో సీకేదిన్నె సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు మాతంగివ సుబ్బరాయుడు, అట్లూరి సుబ్బరాయుడు వలంటీర్లు పాల్గన్నారు.

క్షమాపణ చెప్పాలి

సింహాద్రిపురం : జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఇటీవల వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సింహాద్రిపురంలో గురువారం వలంటీర్లు ఆందోళన చేపట్టారు. మానవ సేవే మాధవ సేవ అన్న రీతిలో ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న వలంటీర్లపై పవన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం ఆయన మూర్ఖత్వానికి నిదర్శనమన్నారు. వెంటనే ఆయన చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోకపోతే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం వలంటీర్లు పవన్ దిష్టి బొమ్మను గురిజాల సర్కిల్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు శవయాత్రగా తీసుకెళ్లి అక్కడ దహనం చేశారు.

పవన్ దిష్టిబొమ్మ ఊరేగింపు

తంబళ్లపల్లె : సమాజంలో సేవాభావంతో విధులు నిర్వహిస్తూ ప్రభుత్వ సేవలను సామాన్య ప్రజలకు అందజేస్తున్న గ్రామవాలంటీర్ల వ్యవస్థపై జనసేన అధినేత పవన్ కల్యాన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని గ్రామ వలంటీర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల కేంద్రంలోని వైఎస్సార్ సర్కిల్‌లో పవన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పవన్‌క్షమాపణలు చెప్పాలన్నారు. మండల కన్వీనర్ చౌడేశ్వర్, మల్లయ్యకొండ చైర్మన్‌మల్‌రెడ్డి,వైస్ ఎంపీపీ కరీమ్, నాయకులు శివారెడ్డి, వైవి రమణారెడ్డిలు నిరసనకు మద్దతు ప్రకటించారు.

వలంటీర్లను విమర్శించే స్థాయి పవన్‌కులేదు..

రామాపురం : వలంటీర్లును విమర్శించే స్థాయి పవన్ కల్యాణ్‌కు లేదని జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శి జాకీర్ హుసేన్ అన్నారు. మండలంలోని నీలకంఠ్రావుపేటలో గురువారం వలంటీర్లతో కలిసి పవన్ కల్యాణ్ ఫొటోపత్రులను దహనం చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ . ఒక చోట కూడా గెలవలేని జనసేన అధినేత పవన్ ఇలా మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇలియాస్, వలటీర్లు పాల్గొన్నారు.


వేంపల్లె : ముతుకూరు గ్రామంలో..


తంబళ్లపల్లె: పవన్ దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న వలంటీర్లు


రామాపురం : నీలకంఠ్రావుపేటలో

కడుపు నొప్పితో సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య


ప్రియాంక(ఫైల్)

మైదుకూరు : కడుపు నొప్పి తాళలేక సచివాలయ ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మైదుకూరులో జరిగింది. మృతురాలి తండ్రి యుగంధర్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మైదుకూరు మండలం నంద్యాలంపేట –2లో మైదుకూరుకు చెందిన ధనపాల ప్రియాంక (27) అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తోంది. ఆమె కొన్నాళ్లుగా కడుపు నొప్పితో బాధపడుతుండేది.నొప్పి ఎక్కువ కావడంతో మూడు రోజుల కిందట విషద్రావణం తాగింది. కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి లక్ష్మీప్రసన్న ప్రియాంక మృతదేహాన్ని పరిశీలించి, ఆమె తండ్రి యుగంధర్‌ను పరామర్శించారు.

ఉరివేసుకుని..

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కలమల్ల గ్రామంలో నివాసం ఉండే బీ శశిరేఖ (30) అనే మహిళ ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి గురువారం తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు కలమల్ల గ్రామంలో నివాసం ఉంటున్న ధనుంజయరెడ్డి ఆర్టీపీపీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా జీవనం సాగిస్తున్నారు.ఇతను మద్యాకి బానిసై కుటుంబానికి పట్టించుకోవడంలేదు.దీంతో కుటుంబంలో సమస్యలు వచ్చాయి. మనస్తాపానికి గురైన శశిరేఖ ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్యహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు సంతానం. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సిమెంటు ట్యాంకర్ బీభత్సం

- ట్రాక్టర్‌తో పాటు రెండు ఆర్టీసీ బస్సులను ఢీకొట్టిన ట్యాంకర్
- ఐదుగురికి గాయాలు


గ్యాస్ లారీని ఢీకొన్న బస్సు,


రోడ్డుకు అడ్డంగా పడిన సిమెంటు ట్యాంకర్

గోపవరం : గోపవరం మండలం పి.పి.కుంట చెక్‌పోస్టు వద్ద గురువారం నెల్లూరు – ముంబై (ఎన్‌హెచ్–67) జాతీయ రహదారిపై సిమెంట్ ట్యాంకర్ బీభత్సం సృష్టించింది. ఒక ట్రాక్టర్‌తో పాటు రెండు ఆర్టీసీ బస్సులను ఢీకొట్టి రోడ్డుకు అడ్డంగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లతో పాటు ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నుంచి సిమెంటు లోడుతో వస్తున్న ట్యాంకర్ అతివేగంగా దూసుకుని వచ్చి ట్రాక్టర్, ఉదయగిరి, పులివెందుల డిపోలకు చెందిన ఆర్టీసీ బస్సులను ఢీకొట్టింది. అదే సమయంలో బద్వేలు నుంచి ఉదయగిరికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికులను దించేందుకు ఆగింది. నెల్లూరు నుంచి పులివెందులకు వెళుతున్న బస్సు ముందు వైపు ఆగి ప్రయాణికులను దించుతోంది. అంతలో ఒక ట్రాక్టర్ కూడా రావడంతో దూసుకొచ్చిన ట్యాంకర్ ముందుగా ట్రాక్టర్, ఉదయగిరి బస్సును ఢీకొని, పులివెందుల డిపో బస్సును ఢీకొట్టడంతో ఆ బస్సు వెళ్లి మరో గ్యాస్ లోడ్‌తో వెళుతున్న లారీని ఢీకొట్టింది. ట్యాంకర్ రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. దీంతో ట్రాక్టర్, సిమెంట్ ట్యాంకర్‌లకు చెందిన ఇద్దరు డ్రైవర్లు, పులివెందుల బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. నిత్యం రద్దీగా ఉండే పి.పి.కుంట సెంటర్‌లో ఇలాంటి ప్రమాదం జరగడం, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు. కాగా సిమెంటు ట్యాంకర్ అతివేగంగా రావడమే ఈ ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. గాయపడిన వారిని 108 సిబ్బంది బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా పడిన సిమెంటు ట్యాంకర్‌ను, ఆర్టీసీ బస్సులను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు, అనంత జట్ల విజయం


తలపడుతున్న కడప, నెల్లూరు జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 క్రికెట్ టోర్నమెంట్‌లో నెల్లూరు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో మూడోరోజు గురువారం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 75.3 ఓవర్లలో 200 పరుగుల వద్ద ఆలౌటైంది. జట్టులోని ప్రణీల్‌రెడ్డి 113 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ సుతేజ్‌రెడ్డి 3, సృజన్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 13.1 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 58 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని మన్విత్ 29 పరుగులు చేసింది. దీంతో నెల్లూరు జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 366 పరుగులు చేయగా, కడప జట్టు 222 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

అనంతపురం జట్టు గెలుపు

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టు 66 ఓవర్లలో 207 పరుగుల వద్ద రెండో ఇన్నింగ్స్ ముగించింది. అనంతపురం బౌలర్లు ప్రదీప్‌రెడ్డి 5 వికెట్లు, లీలాసాయి 4 వికెట్లు తీశారు. అనంతరం రెండోఇన్నింగ్స్ ప్రారంభించిన అనంత జట్టు 16.5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. జట్టులోని పి. అర్జున్ టెండూల్కర్ 47 బంతుల్లో 14 ఫోర్లు, 5 సిక్సర్లతో 97 పరుగులు చేశాడు. దీంతో అనంతపురం జట్టు 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 253 పరుగులు, చిత్తూరు జట్టు 191 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.


113 పరుగులు చేసిన ప్రణీల్‌రెడ్డి


97 పరుగులు చేసిన అర్జున్ టెండూల్కర్

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యా యత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నారు. వివరాలు..అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం అమ్మచెరువుమిట్టకు చెందిన సీ.జ్యోతి (30) కుటుంబసమస్యల కారణంగా ఇంటిలోనే నిద్రమాత్రలు మింగింది. గమనించిన స్థానికులు వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా కురబలకోట మండలం కనసానివారిపల్లె పంచాయతీ కొండతూర్పుపల్లెకు చెందినశంకర్‌రెడ్డి కుమారుడు భానుప్రకాష్‌రెడ్డి (23) ఇటీవలే విశ్వంకాలేజీ ఎంసీఏ పూర్తి చేశాడు. ఇంటి వద్ద ఉంటున్నాడు. గురువారం ఇంటిలో ఎవరూ లేని సమయంలో టమటా పంటకు వాడే పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసుల అధికారులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఎర్రచందనం కూలీల పరారీ

పెద్దమండ్యం : అన్నమయ్య జిల్లా గుర్రంకొండ – పెద్దమండ్యం రహదారిపై రెక్కలకొండపల్లె క్రాస్ వద్ద బుధవారం రాత్రి ఎర్రచందనం కూలీలు పరారయ్యారు. వాల్మీకిపురం పోలీసుల నుంచి తప్పించుకొని గుర్రంకొండ మీదుగా పెద్దమండ్యం వైపు కూలీలు కారులో వస్తున్నట్లు స్థానిక పోలీసులకు సమాచారం రావడంతో రెక్కలకొండపల్లె క్రాస్ వద్ద కాపు కాచారు. గమనించిన ఎర్రచందనం కూలీలు కారును అక్కడే వదిలేసి పరారయ్యారు. కారును స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కూలీల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లుఎస్ఐ రమాంజనేయుడు తెలిపారు.

కూతురు,మనవరాళ్లు కనిపించలేదని ఫిర్యాదు

ఒంటిమిట్ట : మండల పరిధిలో రాచగుడిపల్లి పంచాయతీ నందానగర్ గుట్టపై నివాసం ఉంటున్న సుంకర రాజేశ్వరి(29) బుధవారం మధ్యాహ్నం తన ముగ్గురు కూతుర్లతో సహా కనిపించకుండా పోయిందని ఆమె తండ్రి శ్రీనివాసులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్థానికుల కథనం మేరకు...రాజేశ్వరి తన భర్త దగ్గర నుంచి 4 నెలల కిందట వెళ్లిపోయింది. తిరిగి ఇంటికి వచ్చాక భర్త దగ్గకు వెళ్లకుండా తండ్రి ఇంటి వద్దే ఉండేది. ఏమైందో తెలియదు కానీ బుధవారం మధ్యాహ్నం ఇంటిలో ఎవరూలేని సమయంలో ముగ్గురు కుమార్తెలు యోగిత(9), చైతన్య(7), సమీర(5)లను తీసుకోని ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఇంటికి వచ్చిన శ్రీనివాసులు కూతురు, మనవరాళ్లు కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికాడు. అయినా ఆచూకీ తెలియక పోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆటో బోల్తా : నలుగురికి తీవ్రగాయాలు


గాయపడిన సహనాజ్

ములకలచెరువు : అదుపుతప్పి ఆటో బోల్తాపడటంతో నలుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. 108 సిబ్బంది కథనం మేరకు... ములకలచెరువులోని కదిరి రోడ్డుకు చెందిన అల్లాభక్షు అనారోగ్యం కారణంగా మదనపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌లో చికిత్స చేయించడానికి అతని చెల్లెలు సహనాజ్(38), బంధువులు బీబీజాన్(40), రోషిణి(20), అల్లాభక్షు(45)లు అద్దె ఆటోలో మదనపల్లెకు బయలుదేరారు. బురకాయలకోట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనానికి సైడ్ ఇవ్వబోయి అదుపుతప్పి గుంతలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. అటువెళ్లే ప్రయాణికులు గమనించి 108 వాహనం ద్వారా వారిని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మరో ప్రమాదంలో..

మదనపల్లె : అదే విధంగా నారమాకులతాండాకు చెందిన శంకర్‌నాయక్(45) ద్విచక్రవాహనంలో వస్తూ, పట్టణంలోని గొల్లపల్లి రింగ్‌రోడ్డు వద్ద అదుపుతప్పి పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఔట్‌పోస్టు సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.

'2వ సచివాలయం వద్దే విద్యుదాఘాతం ఘటన'

కమలాపురం : విద్యుదాఘాతంతో ఈ నెల 7వ తేదీన చంద్రశేఖర్ (21) అనే వ్యక్తి మృతి చెందిన ఘటన 2వ సచివాలయం వద్ద జరిగిందని మార్కెట్ యార్డు చైర్మన్ ఎస్‌సీ పుల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. కమలాపురంలో మంచి నీటి ట్యాంక్ పనులు మార్కెట్ యార్డుతో పాటు 2వ సచివాలయం వద్ద జరుగుతున్నాయన్నారు. అయితే చంద్రశేఖర్ మార్కెట్ యార్డు వద్ద జరుగుతున్న ట్యాంక్ నిర్మాణ పనుల వద్ద విద్యుదాఘాతంతో మృతి చెందాడని సోషల్ మీడియా, వాట్సప్ గ్రూపులలో రావడంతో పలు పత్రికల్లోనూ ఈ విధంగానే వార్త ప్రచురితమైందన్నారు. మార్కెట్ యార్డు వద్ద స్తంబాలపై ఉన్న తీగలను విద్యుత్ అధికారులు తొలగించడంతో అక్కడే ఘటన జరిగిందని నిర్ధారించుకుని పత్రికల్లో వార్తలు వచ్చాయన్నారు. కానీ వాస్తవంగా 2వ సచివాలయం వద్ద జరుగుతున్న ట్యాంక్ నిర్మాణ పనుల వద్దే ఈ ఘటన జరిగిందన్నారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన అధికారులు సైతం అపుడు అక్కడే ఉన్నారని వారు తెలిపారు.

ఘర్షణ : ఇరువర్గాలపై కేసు

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఇస్లాంపురం వీధిలో గురువారం జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. నిజాముద్దీన్‌కు ఇస్లాంపురం వీధిలో షాపింగ్ గదులు ఉన్నాయి. జావిద్‌తో పాటు కొందరు అతని స్నేహితులు రోజు షాపింగ్ గదుల ముందు కూర్చొని ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్నారు. ఇక్కడ ఎందుకు కూర్చుంటున్నారని జావిద్ వారిని ప్రశ్నించారు. దీంతో జావిద్‌తో పాటు కొందరు వ్యక్తులు ఆయిల్ మిల్లు ఖాజా ఆఫీసుకు వెళ్లి వాళ్ల మనుషులపై దాడి చేశారు. నిజాముద్దీన్ ఫిర్యాదు మేరకు జావిద్‌తో పాటు కొందరిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు.

ప్రశ్నించినందుకు దాడి చేశారని..

ఇస్లాంపురం వీధిలో జావిద్‌తో పాటు అతని స్నేహితులు కూర్చునే వారు. ఇక్కడ కూర్చోవద్దని నిజాముద్దీన్ చెప్పడంతో ఈ విషయాన్ని ప్రశ్నించేందుకు జావిద్‌తో పాటు కొందరు వ్యక్తులు ఆయిల్‌మిల్లు ఖాజా ఆఫీసు వద్దకు వెళ్లారు. దీంతో వారిపై ఆయిల్‌మిల్లు ఖాజాతో పాటు కొందరు వ్యక్తులు దాడి చేసినట్లు జావిద్ చిన్నమ్మ షేక్ నూరున్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఖాజాతో పాటు ఇంకొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యార్థి నాయకులకు జైలు శిక్ష

ప్రొద్దుటూరు క్రైం : ప్రత్యేక హోదా ఉద్యమ సందర్భంగా 2016లో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి నేరం రుజువు కావడంతో ఫస్ట్ ఏడీఎం హారిక నెల రోజులు జైలు శిక్ష విధించినట్లు త్రీ టౌన్ సీఐ నారాయణయాదవ్ తెలిపారు. 2016 ఆగస్టు 8న ప్రత్యేక హోదా ఉద్యమంలో భాగంగా ప్రొద్దుటూరులోని యోగివేమన యూనివర్సిటీ కళాశాలలో విద్యార్థులతో సమావేశం నిర్వహించడానికి ప్రయత్నించారని ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి ఫిర్యాదు చేశారు. ప్రిన్సిపల్ ఫిర్యాదు మేరకు మల్లేల భాస్కర్, వీఎన్‌పల్లి మండలం పాయసంపల్లె చెందిన బండిసుల దస్తగిరి, కడపకు చెందిన కొండారెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో ముగ్గురికి నెల రోజులు జైలు శిక్ష లేదా ఒక్కొక్కరికీ రూ. 10,500 జరిమానా విధిస్తూ ఫస్ట్ ఏడీఎం హారిక గురువారం తీర్పు చెప్పినట్లు సీఐ తెలిపారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న డీఆర్‌పీ పీడీ సత్యనారాయణ

రామాపురం : డ్వాక్రా సంఘాల మహిళలు బ్యాంకులో తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని, అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నమయ్య జిల్లా డీఆర్‌ఏపీడీ సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.అనంతరం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 30,416 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, అందులో 2,600 సంఘాలు వెనకబడి ఉన్నాయని, సంఘాలను బట్టి రూ.లక్ష నుంచి రూ. 20లక్షలు వరకు రుణాలను అందించనున్నట్లు చెప్పారు. రుణాలు తీసుకున్న ప్రతి సంఘాల సభ్యులు కంతులు సక్రమంగా కట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంలు సత్యానందం, దేవసేన, సీసీలు పాల్గొన్నారు.

యువర్స్

• యంగ్ టాలెంట్

ఆత్మవిశ్వాసం ఉండగా... అధైర్యం ఎందుకు!

ఆరోగ్యం నుంచి బాలీవుడ్ వరకు రకరకాల వీడియోలు చేస్తూ డిజిటల్ క్రియేటర్‌గా దూసుకుపోతుంది ఢిల్లీకి చెందిన సెజల్ కుమార్. 'ఫ్యాషన్-పాట-డ్యాన్స్' ఆమె బలం. మన దేశంలోని టాప్ యూట్యూబ్ స్టార్‌లలో సెజల్ ఒకరు. ఢిల్లీలోని 'ది మదర్స్ ఇంటర్నేషనల్ స్కూల్'లో చదువుకున్న సెజల్ కుమార్‌కు చిన్నప్పటి నుంచి సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది. తండ్రి ఆర్మీ మేజర్. ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్‌లో ఎకనామిక్స్‌లో డిగ్రీ చేసింది. టర్కీకి వెళ్లినప్పుడు 'సమ్మర్ స్టైల్' పేరుతో తొలి వీడియో అప్‌లోడ్ చేసింది. ఆ తరువాత సొంతంగా యూట్యూబ్ చానల్ మొదలుపెట్టింది.చానల్ కోసం చేసిన అయిదు వందలకు పైగా వీడియోలు బాగా పాపులర్ అయ్యాయి.

'ఇండియన్ గర్ల్ బ్యాక్‌ప్యాకింగ్ ఇన్ యూరప్' సిరీస్‌కు మంచి స్పందన లభించింది. సెజల్ తల్లి గైనకాలజిస్ట్. 'ఒక గైనకాలజిస్ట్‌ను అమ్మాయిలు అడగాలనుకునే సందేహాలపై వీడియోలు చేయవచ్చు కదా' అని చానల్ ప్రేక్షకులలో ఒకరు అడిగారు. ఆమె కోరిక మేరకు సెజల్ తల్లితో కలిసి చేసిన 'మామ్ అండ్ మీ' సిరీస్ బాగా పాపులర్ అయింది. ఎలాంటి ప్రశ్న అయినా స్వేచ్ఛగా, నిస్సంకోచంగా అడిగే వాతావరణాన్ని 'మామ్ అండ్ మీ' కల్పించింది.

సెజల్‌కు బాగా నచ్చే సబ్జెక్ట్‌లలో ఫ్యాషన్ ఒకటి. స్ట్రీట్ స్టైల్, స్ట్రీట్ వీడియోలపై మంచి పట్టు ఉంది. తన చానల్ 1 మిలియన్ ఫాలోవర్ మార్క్‌ను చేరుకున్నప్పుడు 'ఓ మై గాడ్' అనుకుంది ఆనందంగా. 'ఇదంతా నేను సొంతంగా సాధించాను' అనే ఆనందం సెజల్‌కు మరింత శక్తిని, ఉత్సాహాన్ని ఇచ్చింది. తన గొంతులోని ఛార్మింగ్ క్వాలిటీతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకుంది. యూట్యూబర్‌గా సెజల్ విజయరహస్యం ఏమిటి? ఆమె మాటల్లో...'మొదటి సూత్రం...గుడ్‌క్వాలిటీ కంటెంట్. గత వీడియో కంటే తాజా వీడియో ఎంతో కొంత బాగుండాలి. రెండో సూత్రం...ఎప్పుడో ఒకప్పుడు కాకుండా నిరంతరం ఏదో ఒక వీడియో పోస్ట్ చేస్తుండాలి. మూడో సూత్రం...ప్రేక్షకులతో ఎప్పటికప్పుడు టచ్‌లో ఉండాలి. మనల్ని మనం అప్‌డేట్ చేసుకోవాలి. వారికి ఎలాంటి వీడియోలు కావాలో తెలుసుకోవాలి'



సెజల్ కుమార్

సెజల్ యూట్యూబ్ చానల్ ప్రేక్షకులలో మహిళలు ఎక్కువ. పద్దెనిమిది నుంచి ఇరవైనాలుగు ఏళ్ల వయసు మధ్య ఉన్న వారు ఉంటారు. 'ఒక కాలేజీ స్టూడెంట్ నా దగ్గరకు వచ్చి మీ పేరుతో కనిపించే వీడియో కనిపిస్తే చాలు క్షణం ఆలస్యం చేయకుండా చూస్తాను అని చెప్పింది. ఆమె మాటలు విన్న తరువాత మరింత కష్టపడాలి అనిపించింది' అంటుంది సెజల్. 'కాళీ కాళీ' మ్యూజిక్ ట్రాక్ సింగర్‌గా ఆమె ప్రతిభకు అద్దం పట్టింది. ఎన్నో వ్యాపారప్రకటనల లో నటించిన సెజల్...'కలలను నిజం చేసుకునే విషయంలో అధైర్యం వద్దు. మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి' అంటుంది.

జైపూర్‌లోని మణిపాల్ యూనివర్శిటీలో 'హౌ టు మేక్ యూట్యూబ్ ఏ కెరీర్?' అనే అంశంపై సెజల్ చేసిన ప్రసంగం ఎంతో మంది విద్యార్థులకు స్ఫూర్తి ఇచ్చి ముందుకు నడిపించింది.

• ఇంగ్లిష్ ఇడియమ్



వన్ హార్స్ టౌన్
చాలా చిన్న టౌన్ అని అర్థం

టేక్ సమ్‌వన్స్ వర్డ్ ఫర్ ఇట్
ఒక విషయాన్ని ఎలాంటి ఆధారం లేకపోయినా ఆమోదించడం.

గెట్ డౌన్ టు బ్రాస్ ట్యాక్స్
ఒక విషయానికి సంబంధించి ముఖ్యమైన చర్చను స్టార్ట్ చేయడం.



• సక్సెస్ స్టోరీ

తన కుటుంబంతో హర్ష్ అగర్వాల్



స్టార్ట్ ఫ్యాషన్ డిజైనర్

ఫ్యాషన్ డిజైనర్‌కు రెండు కళ్లతో పాటు మూడో కన్ను ఉండాలి. ఆ కన్ను చారిత్రక,సాంస్కృతిక వైభవాన్ని చూడగలగాలి. కాలంతో పాటు నడుస్తూనే ముందు కాలాన్ని చూడగలగాలి. జైపూర్‌కు చెందిన ఫ్యాషన్ డిజైనర్ హర్ష్ అగర్వాల్‌కు ఈ సామర్థ్యం ఉంది. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన 27 సంవత్సరాల హర్ష్ అగర్వాల్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్'తో అంతర్జాతీయ స్థాయిలో గెలుపు జెండా ఎగరేశాడు....

రెండు సంవత్సరాల క్రితం...ఆరోజు హర్ష్ అగర్వాల్ ఫ్యాషన్ లేబుల్ ఇన్‌స్టాగ్రామ్ ఎకౌంట్‌కు నోటిఫికేషన్‌ల వరద మొదలైంది. పాపులర్ ఇంగ్లిష్ సింగర్ హారీ స్టైల్స్ 'హరగో హ్యాండ్ ఎంబ్రాయిడ్ షర్ట్స్' ధరించి ఉన్న ఫొటోలు అవి. జైపూర్ ఫ్యాషన్ బ్రాండ్ అంతర్జాతీయ స్థాయిలో వెలిగిపోతుంది అని చెప్పడానికి ఇది చిన్న ఉదాహరణ మాత్రమే.

'ఇలా ఉండాలి. అలా ఉండాలి' అంటూ చిన్నప్పుడు తన దుస్తులను తానే డిజైన్ చేయించేవాడు హర్ష్.

'ఎకనామిక్స్ అండ్ బిజినెస్'లో పట్టా పుచ్చుకున్న హర్ష్ వేరే దారిలో ప్రయాణిస్తానని ఊహించలేదు. 'ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్' ఇంటర్న్‌షిప్ న్యూయార్క్‌లో చేస్తున్న రోజుల్లో 'ఫ్యాషన్' అనే మాట ఎక్కడ వినబడితే తాను అక్కడ ఉండేవాడు. పేరున్న ఫ్యాషన్ డిజైనర్‌లతో ముచ్చటించేవాడు. ఈ క్రమంలో తనకు సొంతంగా ఏదైనా చేయాలనిపించేది.

ఇండియాకు తిరిగివచ్చిన తరువాత...పశ్చిమ బెంగాల్ నుంచి గుజరాత్ వరకు ఎన్నో ప్రాంతాలకు వెళ్లి మన చేనేతకళావైభవాన్ని రెండు కళ్లలో పదిలపరుచుకున్నాడు. వాటి నుంచి స్ఫూర్తి తీసుకొని తల్లి, సోదరితో కలిసి 'హరగో హ్యాండ్స్' అనే మెన్స్‌వేర్ లేబుల్‌కు శ్రీకారం చుట్టాడు.

ముగ్గురితో మొదలైన 'హరగో'లో ఇప్పుడు 20 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ టీమ్‌లో టైలర్‌లు, జూనియర్ డిజైనర్‌లు, ప్రొడక్షన్ ఇన్‌చార్జ్‌లు ఉన్నారు.

'హస్తకళలపై ఎక్కువగా దృష్టి కేంద్రీకరించాలనుకున్నాను. మన దేశానికి తనదైన గొప్ప సాంస్కృతిక, శిల్పకళావైభవం ఉంది. అది చేతివృత్తి కళాకారుల పనిలో ప్రతిఫలిస్తుంది. అలాంటి వారికి సహాయంగా నిలవాలనుకున్నాను' అంటాడు హర్ష్ అగర్వాల్.

ఒక డిజైన్ హిట్ అయిన తరువాత దాని వెంటే పయనించడం అని కాకుండా ఎప్పటికప్పుడు కొత్త కొత్త డిజైన్‌లపై వర్క్ చేస్తుంటాడు హర్ష్. ప్రతి రోజు ఒక కొత్త శాంపిల్ రూపొందిస్తాడు. 105 పీస్‌లు రెడీ కాగానే ప్రీ-ఆర్డర్స్ కోసం సోషల్ మీడియా పేజీలలో ప్రకటిస్తాడు.

కోవిడ్ కల్లోలం సద్దుమణిగిన తరువాత కొత్త కలెక్షన్ కోసం ఇంటర్నేషనల్ బయర్స్ నుంచి ఆర్డర్లు వెల్లువెత్తాయి. లేబుల్ క్లాతింగ్ రిటైలర్‌లలో మ్యాచెస్ ఫ్యాషన్-లండన్, సెసెన్స్(మాంట్రియల్), ఎల్ఎమ్‌డీఎస్-షాంఘై, బాయ్‌హుడ్-కొరియా...మొదలైనవి ఉన్నాయి.

'హరగో'కు ఇది టిప్పింగ్ పాయింట్‌గా మారింది. బ్రాండ్ అభిమానుల్లో ఇంగ్లాండ్‌కు చెందిన టెలివిజన్ హోస్ట్, ఫ్యాషన్ డిజైనర్ టాన్ ఫ్రాన్స్ ఉన్నాడు.

'కొన్ని నెలల క్రితం హర్ష్ బ్రాండ్ గురించి విన్నాను. నా నెట్‌ఫ్లిక్స్ షో కోసం అతడు డిజైన్ చేసిన దుస్తులు ధరించాను. కొత్తగా, కంఫర్ట్‌గా అనిపించాయి. డిజైనింగ్‌లో హర్ష్‌కు తనదైన నేర్పు ఉంది' అంటున్నాడు టాన్ ఫ్రాన్స్.

హర్ష్ కొత్త కలెక్షన్ డిజైన్ స్కెచ్‌లతో మొదలు కాదు. నేతకారులతో ముచ్చటించిన తరువాత ఒక ఐడియా వస్తుంది. దాన్ని మెరుగులు దిద్దడంపై దృష్టి పెడతాడు. 'హర్ష్ వర్క్‌లో క్వాలిటీ మాత్రమే కాదు క్లాసిక్ లుక్ కనిపిస్తుంది' అంటుంది టెక్స్‌టైల్ ఇనోవేషన్ ప్రాజెక్ట్ 'అంబ' ఫౌండర్ హేమ ష్రాఫ్ పటేల్.

• టెక్.. టాక్



హువావే నోవా 11 ప్రో

• డిస్‌ప్లే: 6.78 అంగుళాలు • రిఫ్రెష్‌రేట్: 120 హెచ్‌జెడ్ • బ్యాటరీ: 4500 ఎంఏహెచ్ • ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ +8 ఎంపీ • ర్యామ్: 8జీబి • రిజల్యూషన్: 1200X2652 పిక్సెల్స్ • ఇంటర్నల్ మెమోరీ: 256 జీబి • ఆపరేటింగ్ సిస్టమ్: హామని వోఎస్ • బరువు: 188 గ్రా. • కలర్స్: లుమినస్ గోల్డ్, డాన్ గోల్డ్, స్నోవీ వైట్



నాయిస్ ఫిట్ ట్విస్ట్ ప్రో స్మార్ట్‌వాచ్

• డిస్‌ప్లే: 1.4 అంగుళాలు • ఫీచర్: బ్లూటూత్ కాలింగ్ మెటాలిక్ డయల్ • హెల్త్ మానిటర్స్: హార్ట్‌రేట్, బ్లడ్ ఆక్సిజన్ లెవెల్ సెన్సర్, స్లీప్ ట్రాకర్... మొదలైనవి. • వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెంట్ • 120 స్పోర్ట్స్ మోడ్స్ • బ్యాటరీ: 300 ఎంఏహెచ్

టేబుల్ టాప్ స్టాండ్



బ్రాండ్: స్వాప్‌కార్ట్
కలర్: మల్టీ కలర్
కంపాటబుల్: ఆల్ స్మార్ట్‌ఫోన్స్ ప్రొడక్షన్ డైమెన్షన్స్: 16X10X4 సెంటీ మీటర్
ఫీచర్స్: ఫ్లెక్సిబుల్, ఫోల్డబుల్ ఆర్మ్
మెటీరియల్: అల్యూమినీయం
బరువు: 240 గ్రా.



గూగుల్ ఫొటోస్‌లో కొత్త ఎఫెక్ట్‌లు...

ఫొటో అండ్ వీడియో వ్యూయింగ్ యాప్ 'గూగుల్ ఫొటోస్'లో ఫిక్స్ లైటింగ్, మ్యాజిక్ ఎరేజర్‌లాంటి ఎన్నో ఉపయోగకరమైన ఫీచర్లు ఉన్నాయి. తాజాగా త్వరలో రాబోతున్న 12 కొత్త ఎఫెక్ట్‌ల గురించి ప్రకటించింది గూగుల్. అవి ఏమిటంటే... బ్లాక్ అండ్ వైట్ ఫిల్మ్, లోమో, డస్ట్ మిక్స్, పేపర్ టియర్, లైట్ లీక్, ఫిల్మ్ మూడ్, ఫిష్ ఐ, క్రోమటిక్, వింటేజ్, లేబొట్స్, పోస్టర్ అండ్ రెట్రో ఫిల్మ్.

• గేమింగ్: నేడే విడుదల



వస్తున్నారహో!

ఊహించని ఉపద్రవం... కలలో కూడా చూడని క్రూర జంతుసమూహం... అడుగు తీసి అడుగు వేస్తే ప్రమాదం. ఎక్సోప్రైమల్‌లో ఎన్నో సవాళ్లు మీ కోసం ఎదురుచూస్తున్నాయి. థర్డ్-పర్సన్ షూటర్‌గేమ్ ఎక్సోప్రైమల్ నేడు విడుదల అవుతుంది. ఈ మల్టీప్లేయర్ యాక్షన్ గేమ్‌లో ప్లేయర్ డైనోసర్‌లతో పాటు ఎన్నో అపరిచిత మృగాలతో పోరాడవలసి ఉంటుంది. ప్లేయర్-వర్సెస్-ప్లేయర్-వర్సెస్ ఎన్విరాన్‌మెంట్ వీడియో గేమ్ ఇది. ప్లేయర్ ఎక్సోఫైటర్‌ను కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. ఈ గేమ్‌లో ఎన్నో రకాలైన వెపన్స్ ఉంటాయి. గేమ్‌లోని మెయిన్ మోడ్ డినో సర్వైవల్. 'ఎక్సోప్రైమల్'ను యాక్షన్ గేమ్‌గా తీర్చిదిద్దింది జపాన్‌కు చెందిన వీడియోగేమింగ్ కంపెనీ క్యాప్‌కామ్.

ఇంజిన్: ఆర్ఈ ఇంజిన్ ; జానర్: థర్డ్ పర్సన్ షూటర్ ; ప్లేస్టేషన్స్: ప్లే స్టేషన్ 4, ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

ఐ వాన్న వాకౌట్



పూజా హెగ్డే
రష్మికా మందన్నా

ఒక్క చాన్స్ వచ్చేవరకే ఎవరైనా ఆ చాన్స్ కోసం కష్టపడాలి. ఆ ఒక్క చాన్స్ బంపర్ చాన్స్ అయితే ఆ తర్వాతి చాన్సులు అవే వస్తాయి. ఇందుకు ఓ ఉదాహరణ పూజా హెగ్డే, రష్మికా మందన్నా. స్టార్ హీరోయిన్లుగా ఈ ఇద్దరూ తెలుగు, తమిళ, హిందీ చిత్రాలు చేస్తూ దూసుకెళుతున్నారు. చివరికి ఈ ఇద్దరూ డేట్స్ సర్దుబాటు చేయలేక సినిమాలు వదులుకునేంత బిజీ. అటు హిందీకి వెళితే ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ కూడా ఈ మధ్య ఒక సినిమా వదులుకున్నారు. 'నో డేట్స్.. ఐ వాన్న వాకౌట్' అంటూ ఈ నలుగురూ వదులుకున్న చిత్రాల గురించి, పూజ-రష్మిక వాకౌట్ చేయడం వల్ల ఆ ప్లేస్‌ని రీప్లేస్ చేయడానికి దర్శక-నిర్మాతలు పరిశీలిస్తున్న హీరోయిన్ గురించి తెలుసుకుందాం.

గుంటూరు కారం మిస్

'ఒక లైలా కోసం'తో (2014) తొలిసారి తెలుగు తెరపై మెరిశారు పూజా హెగ్డే. ఆ తర్వాత వరుస సినిమాలతో ఇక్కడ ఫుల్ బిజీ. అటు తమిళ, హిందీ నుంచి అవకాశాలు దక్కించుకున్నారు. ఇలా బిజీగా ఉన్న పూజ ఇటీవల డేట్స్ సర్దుబాటు చేయలేక 'గుంటూరు కారం' నుంచి తప్పుకున్నారని ఆమె వ్యక్తిగత సిబ్బంది పేర్కొన్న విషయం తెలిసిందే. మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. త్రివిక్రమ్‌తో 'అరవింద సమేత వీర రాఘవ', 'అల.. వైకుంఠపురములో' వంటి హిట్ చిత్రాల్లో నటించారు పూజ. 'గుంటూరు కారం' నుంచి వాకౌట్ చేయకపోయి ఉంటే ఈ ఇద్దరి కాంబోలో ఇది మూడో సినిమా అయ్యుండేది. అలాగే 'మహర్షి' వంటి హిట్ తర్వాత మహేశ్‌బాబు-పూజ కాంబోలో రెండో సినిమా అయ్యుండేది. అయితే 'గుంటూరు కారం' నుంచి పూజ తప్పుకున్నప్పటికీ సూర్యదేవర నాగవంశితో కలిసి త్రివిక్రమ్ భార్య సాయి సౌజన్య నిర్మించనున్న చిత్రంలో ఈ బ్యూటీ నటించే చాన్స్ ఉందట. సాయిధరమ్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో రూపొందించనున్న చిత్రానికి పూజని హీరోయిన్‌గా తీసుకోవాలని నాగవంశి, సాయి సౌజన్య అనుకున్నారట. పూజని సంప్రదించారని సమాచారం. అయితే ఇంకా ఆమె కథ వినలేదట.



అనుష్కా శర్మ



కియారా అద్వానీ

నితిన్ సినిమా మిస్

'ఛలో'తో తెలుగుకి పరిచయమయ్యారు రష్మికా మందన్నా. ఈ సినిమాలో సింపుల్ గాళ్‌గా ఎంట్రీ ఇచ్చి, స్టార్‌గా ఎదిగారు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ సినిమాలు చేస్తున్నారీ బ్యూటీ. ప్రస్తుతం 'పుష్ప 2', 'రెయిన్ బో'తో పాటు మరో తెలుగు సినిమా, హిందీ చిత్రాలతో రష్మిక ఫుల్ బిజీ. అందుకే నితిన్ సరసన ఒప్పుకున్న చిత్రానికి కాల్‌షీట్స్ అడ్జెస్ట్ చేయలేకపోయారట. తెలుగులో రష్మిక ఎంట్రీ ఫిల్మ్ 'ఛలో' దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. తొలి హిట్ ఇచ్చిన దర్శకుడితో 'భీష్మ' వంటి రెండో హిట్ కూడా అందుకున్నారు రష్మిక. సో... వెంకీ కుడుములతో మూడో సినిమాని రష్మిక మిస్ అయ్యారు.

నిజానికి 'భీష్మ' సినిమాతో నితిన్-రష్మిక హిట్ పెయిర్ అనిపించుకున్నారు. ఒకవేళ రష్మిక డేట్స్ అడ్జెస్ట్ చేయగలిగితే మరోసారి ఈ జంట సిల్వర్ స్క్రీన్‌పై కనిపించేది.



కత్రినా కైఫ్



ప్రియాంకా చోప్రా

రీప్లేస్ చేసేది ఎవరు?

బాలీవుడ్‌లో ఈ మధ్య ప్రకటించిన చిత్రాల్లో 'జీ లే జరా' అందరి దృష్టినీ ఆకర్షించింది. దానికి కారణం ఇది లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్ కావడం, చిత్రదర్శకుడు ఫర్హాన్ అక్తర్ కథానాయికలుగా ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్, ఆలియా భట్‌లను ఎన్నుకోవడం. అయితే హాలీవుడ్ ప్రాజెక్ట్స్ వల్ల ఈ చిత్రాన్ని 2024లో ఆరంభించాలని ఫర్హాన్‌ని ప్రియాంక కోరారట. ఫర్హాన్ ఓకే చెప్పారని టాక్. ఈలోపు కత్రినా వేరే ప్రాజెక్ట్స్ ఒప్పుకోవడంతో ఈ చిత్రానికి డేట్స్ సర్దుబాటు చేయలేనన్నారట. కాగా 'సిటాడెల్ 2' స్టార్ట్ అయ్యే చాన్స్ ఉన్నందున టోటల్‌గా ఈ సినిమా నుంచి వాకౌట్ చేయాలని ప్రియాంక నిర్ణయించుకున్నారట. కత్రినా కూడా ఇదే నిర్ణయం తీసుకున్నారని సమాచారం.



ఆలియా భట్

ఒకరు వదులుకున్న చాన్స్ ఆటోమేటిక్‌గా వేరొకరికి దక్కడం సహజం. అలా 'గుంటూరు కారం' నుంచి పూజా హెగ్డే తప్పుకోవడం శ్రీలీలకి, మీనాక్షీ చౌదరికి ప్లస్ అయింది. ముందు ఈ చిత్రంలో శ్రీలీలను రెండో హీరోయిన్‌గా అనుకున్నారు. కానీ పూజ తప్పుకోవడంతో ఆమె మెయిన్ హీరోయిన్ అయ్యారు. శ్రీలీల స్థానంలోకి మీనాక్షీ చౌదరి వచ్చారు. అలాగే నితిన్ సినిమా నుంచి రష్మికా మందన్నా తప్పుకోవడంతో ఆ చాన్స్ కూడా శ్రీలీలకే వెళ్లనుందని టాలీవుడ్ టాక్. అటు హిందీ 'జీ లే జరా' విషయానికొస్తే.. ప్రియాంకా చోప్రా, కత్రినా కైఫ్ తప్పుకోవాలనుకోవడంతో అనుష్కా శర్మ, కియారా అద్వానీ వంటి నాయికల పేర్లను పరిశీలిస్తున్నారట ఫర్హాన్ అక్తర్.



మీనాక్షీ చౌదరి
శ్రీలీల



'హాయ్ నాన్న' పోస్టర్

హాయ్ నాన్న

నాని హీరోగా నటిస్తున్న తాజా చిత్రానికి 'హాయ్ నాన్న' అనే టైటిల్ ఖరారు చేశారు. శౌర్యువ్ దర్శకత్వంలో మోహన్ చెరుకూరి (సీవీఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రంలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్. ఈ చిత్రానికి తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో 'హాయ్ నాన్న' అని, హిందీలో 'హాయ్ పప్పా' అనే టైటిల్‌ను ఖరారు చేసి, ఫస్ట్ లుక్, గ్లింప్స్‌ను విడుదల చేశారు. ''తండ్రీ-కూతురు భావోద్వేగాలతో కూడిన ఫీల్ గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఇది. యూనిక్ స్టోరీ లైన్‌తో రూపొందుతున్న ఈ చిత్రం అన్ని భాషలవారికీ కనెక్ట్ అవుతుంది. ఈ ఏడాది డిసెంబర్ 21న చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

మహారాజా రెడీ



విజయ్ సేతుపతి

విజయ్ సేతుపతి కెరీర్‌లో 50వ మైలురాయిగా తెరకెక్కిన చిత్రం 'మహారాజా'. నితిలన్ సామినాథన్ దర్శకత్వం వహించారు. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, నట్టి నటరాజ్ కీలక పాత్రలు పోషించారు. ప్యాషన్ స్టూడియోస్ సుధన్ సుందరం, ది రూట్-థింక్ స్టూడియోస్ జగదీష్ పళనిసామి సమర్పణలో రూపొందిన ఈ సినిమా రిలీజ్‌కు రెడీ అవుతోంది.

నార్నే నితిన్ కొత్త సినిమా షురూ



అల్లు అరవింద్, నయన్ సారిక, నార్నే నితిన్

హీరో ఎన్టీఆర్ బావమరిది నార్నే నితిన్ హీరోగా కొత్త సినిమా షురూ అయింది. అంజిబాబు కంచిపల్లి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రంలో నయన్ సారిక హీరోయిన్‌గా నటిస్తున్నారు. అల్లు అరవింద్ సమర్పణలో జీఏ 2 పిక్చర్స్‌పై బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్న ఈ చిత్రం గురువారం ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ చందు మొండేటి గౌరవ దర్శకత్వం వహించగా, దర్శకుడు మారుతి స్క్రిప్ట్‌ను మేకర్స్‌కు అందించారు. ''జీఏ 2 బ్యానర్‌లో ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న చిత్రమిది'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సహనిర్మాత: ఎస్‌కేఎన్, కెమెరా: సమీర్ కళ్యాణ్, సంగీతం: రామ్ మిర్యాల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్: భానుప్రతాప్, రియాజ్ చౌదరి, అజయ్ గద్దె.

మిస్టర్ ప్రెగ్నెంట్ డేట్ ఫిక్స్

'బిగ్ బాస్' ఫేమ్ సయ్యద్ సోహైల్ రియాన్ హీరోగా నటించిన 'మిస్టర్ ప్రెగ్నెంట్' విడుదల తేదీ ఖరారైంది. ఆగస్టు 18న ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. శ్రీనివాస్ వింజనంపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రూపా కొడవాయుర్ హీరోయిన్‌గా నటించారు. అప్పిరెడ్డి, రవీందర్ రెడ్డి సజ్జల, వెంకట్ అన్నపరెడ్డి నిర్మించారు. ''ఈ చిత్రంలో సోహైల్ ప్రెగ్నెంట్‌గా కనిపించనున్నాడు. తెలుగు తెరపై ఇదొక కొత్త తరహా ప్రయత్నం. వైవిధ్యమైన సినిమాలకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో మా 'మిస్టర్ ప్రెగ్నెంట్' సక్సెస్ సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: శ్రవణ్ భరద్వాజ్.



సయ్యద్ సోహైల్, రూపా కొడవాయుర్

నా చివరి సినిమాని బలమైన కథతో చేయాలనుకున్నా!

– ఉదయనిధి స్టాలిన్



''నాయకుడు' చాలా మంచి కథ, పొలిటికల్ డ్రామా, సామాజిక న్యాయం, ప్రజల మధ్య సమానత్వం గురించి ఈ మూవీలో చర్చించాం. యూనివర్సల్ అప్పీల్ ఉన్న ఈ కథ తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుంది'' అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన తమిళ చిత్రం 'మామన్నన్'. ఉదయనిధి స్టాలిన్ హీరోగా నటించి, నిర్మించారు. కీర్తీ సురేష్ హీరోయిన్. జూన్ 29న ఈ చిత్రం విడుదలైంది. తెలుగులో 'నాయకుడు' పేరుతో ఏషియన్ మల్టీప్లెక్స్, సురేష్ ప్రొడక్షన్స్ విడుదల చేస్తున్నాయి. నేడు ఈ మూవీ రిలీజవుతోంది. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ–''తెలుగులో నా గత చిత్రాలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. అందుకే ఈ సినిమాను తమిళంలో మాత్రమే విడుదల చేయాలనుకున్నాం. అయితే తమిళంలో మంచి వసూళ్లను సాధించడంతో ఏషియన్, సురేష్ ప్రొడక్షన్స్ తెలుగులో విడుదల చేస్తున్నారు. నేను సినిమాల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాక నా చివరి సినిమాని బలమైన కథతో మారి సెల్వరాజ్‌తో చేయాలనుకున్నాను'' అన్నారు.